క్లుప్తంగా

బీమా సొమ్ము అందజేత



బీమా సాయం అందిస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి దంపతులు

మండపేట: అర్తమూరుకు చెందిన ఎస్.వీరలక్ష్మి రెండు రోజుల క్రితం గొరపట్నం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వైఎస్సార్ బీమా పథకం కింద ఆమె కుటుంబానికి రూ.ఐదు లక్షలు సాయం మంజూరైంది. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా ప్రభుత్వం నుంచి విడుదలైన రూ.10వేలను బుధవారం నామిని పట్నాల సత్యవతికి సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు అందజేశారు. బీమా పరిహారం లబ్ధిదారుల ఖాతాకు ప్రభుత్వం నేరుగా జమచేస్తుందని వివరించారు. యువజన విభాగం నేత గొలుగూరి సందీప్‌రెడ్డి, తాపేశ్వరం సొసైటీ చైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి గారు, ఈఓ అనిల్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు సత్యవాడలో 'ఆరోగ్య సురక్ష'

కె.గంగవరం: మండలంలోని సత్యవాడలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తామని వైద్యులతో పాటు మందులు అందుబాటులో ఉంటాయని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటు మందులు కూడా అందిస్తారన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



పందిరి రాటకు పూజలు చేస్తున్న భక్తులు

కపిలేశ్వరపురం: అంగర పల్లపు వీధి రామాలయం వద్ద దసరా ఉత్సవాల నిర్వహణకు పందిరి రాట ముహూర్త పూజలు చేశారు. పండితులు వారణాసి వెంకటేశ్వరరావు భక్తులతో పూజలు చేయించారు. ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు మండపేటలో గడప గడపకూ

మండపేట: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం పట్టణంలోని 17వ వార్డులో పర్యటించనున్నట్టు క్యాంపు కార్యాలయ కార్యదర్శి టపా పుల్లేశ్వరరావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు మొదలయ్యే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ప్రజాభీష్టానికి విరుద్ధంగా పాలన

కాజులూరు: దేశంలో ప్రజాభీష్టానికి విరుద్ధంగా బీజేపీ ప్రభుత్వం నిరంకుశ ధోరణితో పాలన సాగిస్తుందని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. బుధవారం మండలంలోని ఒంటితాడిలో ఆయన రైతుల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది వ్యవసాయ చట్టాలు రద్దు కోరుతూ ఉత్తరప్రదేశ్ లఖీంపూర్‌లో జరుగుతున్న రైతుల దీక్షను భగ్నం చేసేందుకు కేంద్రమంత్రి అజయ్‌మిశ్రా కొడుకు ఆశిష్‌మిశ్రా వారిపై కారు ఎక్కించుకుపోయాడన్నారు. ఈ సంఘటనలో నలుగురు మృతి చెందగా సుమారు 20 మంది గాయాల పాలయ్యారన్నారు. దీనిపై ఇప్పటి వరకూ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో దేశ వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం నాయకులు కురుపూడి భూచక్రం, వనుం వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పుట్టినిల్లు టీడీపీ

మండపేట: సంక్షేమానికి టీడీపీ పుట్టినిల్లు వంటిదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని వెలగతోడులో బుధవారం ఆయన టీడీపీ మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మ్యానిఫెస్టో వివరాలను తెలియజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నాయకుల పర్యటన

కపిలేశ్వరపురం: కేదారిలంకలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ళ లీలాకృష్ణ, ఆయన సతీమణితో కలిసి ఇంటింటి పర్యటన చేపట్టారు. జన చైతన్య యాత్ర పేరుతో చేపట్టిన యాత్రలో గ్రామ జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ర్యాలిలో ఎమ్మెల్యే పర్యటన

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యే, చిర్ల జగ్గిరెడ్డి పర్యటిస్తారని మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు తెలిపారు. ఉదయం పీహెచ్‌సీలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేపడతారన్నారు. అలాగే మాజీ సర్పంచ్ పేర్చేర్ల నరసింహరాజు విగ్రహావిష్కరణలో పాల్గొంటారన్నారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొని పలు సూచనలు ఇస్తారన్నారు. సాయంత్రం గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ధూప దీప నైవేద్యం సమర్పయామి..

- డీడీఎన్ఎస్‌కు నియోజకవర్గంలో 24 ఆలయాల ఎంపిక
- రూ. 2.3కోట్లతో 23 రామాలయాలు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మండపేట: ధూప దీప నైవేద్యం పథకానికి (డీడీఎన్ఎస్) నియోజకవర్గంలోని 24 ఆలయాలు ఎంపికయ్యాయి. ఈ పథకం కింద ఒక్కో ఆలయానికి నిర్వహణ నిమిత్తం నెలకు రూ.ఐదు వేలు చొప్పున ప్రభుత్వ సాయం అందించనుంది. మరో పక్క టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి 23 రామాలయాలు మంజూరయ్యాయి.

ఆదాయం లేక వెలవెలబోతున్న ఆలయాలకు సరికొత్త శోభను తెస్తూ నిత్య నైవేద్య కార్యక్రమాలు నిర్వహణ కోసం డీడీఎన్ఎస్‌ను పథకానికి దివంగత వైఎస్ శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.30 వేలు కన్నా తక్కువ ఆదాయం కలిగిన ఉన్న ఆలయాలు, రెండున్నర ఎకరాల లోపు మాగాణి, లేదా ఐదెకరాల లోపు మెట్ట భూమి ఉన్న వాటిని ఈ పథకానికి ఎంపిక చేస్తారు. దూప, దీప, నైవేద్యం ఖర్చుల నిమిత్తం అప్పట్లో నెలకు రూ.2500 అందజేసేవారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేయగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఈ మొత్తాన్ని రూ.5వేలకు పెంచారు. ధూపదీప నైవేద్యాల నిమిత్తం రూ.రెండు వేలు, అర్చకుని గౌరవ వేతనంగా రూ.మూడు వేలు చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. ఆలయ అర్చకుని బ్యాంకు ఖాతాకు ఈ మొత్తం జమ చేస్తుంటారు.



ద్వారపూడిలో డీడీఎన్ఎస్ పథకానికి ఎంపికైన రామాలయం

నియోజకవర్గంలో 24 ఆలయాలు ఎంపిక

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో డీడీఎన్ఎస్‌కు నియోజకవర్గంలోని 24 ఆలయాలను ఎంపిక చేస్తూ దేవదాయ శాఖ ఆదేశాలిచ్చింది. వాటిలో రామాలయం (ఏడిద), సిద్ధి వినాయక స్వామి ఆలయం (కపిలేశ్వరపురం), వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం (వల్లూరు), బసవేశ్వరస్వామి ఆలయం (నల్లూరు), రామాలయం (అంగర), అమరేశ్వరస్వామి ఆలయం (అచ్యుతాపురం), సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం (అంగర), వనువులాంబిక అమ్మవారి ఆలయం (వాకతిప్ప) ఆలయాలను ఎంపిక చేశారు. వేంకటేశ్వరస్వామి వారి ఆలయం (అద్దంకివారి లంక), సీతారామ స్వామి ఆలయం (వీధి వారి లంక), వీరాంజనేయస్వామి ఆలయం (చెల్లూరు), రామాలయం



ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతున్న మెర్నిపాడు ఆలయ కమిటీ సభ్యులు

(మాచర పెద్దింటి వీధి), వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయం (సోమేశ్వరం), మారెమ్మ ఆలయం (వెంటూరు), పోలేరమ్మ ఆలయం (తాపేశ్వరం), అగస్త్యేశ్వరస్వామి ఆలయం (అర్తమూరు) ఆలయాలు ఎంపికయ్యాయి. కనకమహాలక్ష్మి పేరంటాళ్ల అమ్మవారి ఆలయం (కేశవరం), కోదండరామస్వామి ఆలయం (ద్వారపూడి), వేంకటేశ్వరస్వామి ఆలయం (మండపేట వీరభద్రపురం), వేంకటేశ్వరస్వామి ఆలయం (మారేడుబాక), శ్రీ కోదండరామాలయం (చెల్లూరు), వెలగాలమ్మ ఆలయం (వెంటూరు), శ్రీ కోదండరామాలయం (పలసపూడి నరాలవారిపాలెం), విశ్వేశ్వరస్వామి ఆలయం (లొల్ల) ఉన్నాయి.

టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో..

టీటీడీ శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో నియోజకవర్గానికి కొత్తగా 23 రామాలయాలు మంజూరయ్యాయి. ఒక్కో ఆలయం నిర్మాణానికి టీటీడీ రూ.10 లక్షలు సాయం అందిస్తుంది. వాటిలో అర్తమూరు, ఏడిద సావరం, పాలతోడు, కేశవరం, వెలగతోడు, మెర్నిపాడు, మారేడుబాక, వేములపల్లి, కపిలేశ్వరపురం మండలంలో నల్లూరు, నేలటూరు, కేదారిలంక, నిడసనమెట్ట, పడమఖండ్రిక, అద్దంకివారిలంక, అంగర, రాయవరం మండలం లొల్ల, వెదురుపాక, మాచవరం, సోమేశ్వరం, రాయవరం, చొల్లంగివారి పేట, వెంటూరు, శ్రీరామ్‌నగర్ కాలనీ ఉన్నాయి.

ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు

ఆదాయం లేని ఆలయాల నిర్వహణకు సాయం అందించడంతో పాటు కొత్తగా రామాలయాల నిర్మాణానికి కృషి చేస్తూ సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను పలువురు అభినందిస్తున్నారు. అధిక సంఖ్యలో ఆలయాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ తోటను ఆయా గ్రామాలకు చెందిన పెద్దలు, ఆలయ కమిటీల సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



అన్నాయిపేటలో రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేట మాజీ సర్పంచ్ పెమ్మిరెడ్డి రామకృష్ణ ఈ నెల ఒకటిన మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీ బోస్ తనయుడు పిల్లి సూర్యప్రకాశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కర్రి చిట్టిబాబు, జనసేన నాయకుడు చిక్కాల దొరబాబు తదితరులు పరామర్శించారు. రామకృష్ణ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ పెమ్మిరెడ్డి రామకృష్ణ నిబద్ధత కలిగిన రాజకీయ నేతగా పేర్కొన్నారు. బీజేపీ ఉమ్మడి తూర్పుగోదావరి ఉపాధ్యక్షుడుగా, ప్రధాన కార్యదర్శిగా, రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా పనిచేసి బీజేపీ సీనియర్ నాయకులు వెంకయ్యనాయుడు, హరిబాబు, విద్యాసాగర్‌రావు, దత్తాత్రేయ తదితరులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారన్నారు. టెలికం బోర్డు అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారన్నారు. సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధ్యేయం

సోమేశ్వరంలో జగనన్న ఆరోగ్య సురక్ష

రాయవరం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ వైపు అడుగులు వేస్తుందని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు అన్నారు.సోమేశ్వరంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ ఆరిఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్, శ్రీనివాసరావు, వెంకటరమణలు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తుందన్నారు. అనంతరం వైద్యులు కన్యాకుమారి, జీఎం చంద్రకుమారి, రాము, ఎ.దేవిరాజశ్రీ, ఎం.శ్రీనివాస్‌లు వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యసేవలందించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శాకా ఆదినారాయణ, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంగర శిబిరంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న నిపుణురాలు

536 మందికి పరీక్షలు

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి జనం పోటెత్తారు. సర్పంచ్ వాసా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన శిబిరాన్ని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డా.పి.రత్నకుమారి ఆధ్వర్యంలో శిబిరాన్ని పర్యవేక్షించారు. గ్రామంలో 536 మందికి బీపీ, షుగరు వంటి పరీక్షలు చేశారు. అనంతరం విభాగాలు వారీగా వారికి చికిత్స చేశారు. చిన్నారుల సమస్యలపై 12 మందికి, గర్భకోశ వ్యాధులకు సంబంధించి 21, ఆప్తాలమిక్ 127, బీపీ, షుగరు వంటి సాధారణ వ్యాధులు 32, ఎముకకు సంబంధించి 112, చెవి, ముక్కు, గొంతు 48, ఇతర వ్యాధులకు సంబంధించి 184 మొత్తం 536 మందికి చికిత్సనందించారు. వారిలో 38 మందికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ సిఫారసు చేశారు. శిబిరంలో అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డా.పి.రత్నకుమారి, అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి చెందిన ఆర్థో సర్జియన్ డాక్టర్ వర్మ్మా తరుణ్, ఇలాంటి నిపుణులు డాక్టర్ ఎస్‌కె అర్షతున్నీషా, వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యులు చిట్టూరి రాకేష్ చౌదరి చికిత్స సేవలందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ యర్రా వీరన్నబాబు, ఎంపీహెచ్ఈఓ జుత్తుక మల్లిఖార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సోమేశ్వరంలో రోగులకు మందులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్ తదితరులు

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

కె.గంగవరం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని పాణింగపల్లి సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్దపీట వేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, వైస్ ఎంపీపీలు నీతిపూడి మధుబాల, దూడల నాగేశ్వరావు, సర్పంచ్ చీకట్ల సునిత, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కందులపాలెంలో..

రామచంద్రపురం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండలంలోని కందులపాలెంలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 320 మందికి వైద్య సేవలు అందించారు. ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, గ్రామ సర్పంచ్ పెంకే కృష్ణవేణి, ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, ఉప సర్పంచ్ వెంటపల్లి రామకృష్ణ, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్‌లు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 72 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు, ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు, స్పెషలిస్టు డాక్టర్లు పాల్గొన్నారు.



పాణింగపల్లి శిబిరం వద్ద వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ఆలమూరులో చిన్నారులకు టీకాలు అందజేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, కె.జ్యోతికుమార్ హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, ఎంపీహెచ్ఈఓ బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్ బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు. పినపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్శిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లను అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పీసీవీ, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

రావులపాలెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం డ్వాక్రా మహిళలను బేషరతుగా రుణ విముక్తి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆలమూరు మండలానికి చెందిన వివిధ డ్వాక్రా సంఘాల మహిళలు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసి సీఎం జగన్‌కి వారి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. మూడు సంవత్సరాలుగా తమ గ్రూపులకు రుణమాఫీ జరగలేదని మూడు సంవత్సరాల మొత్తం కలిపి ఒకేసారి ఇప్పుడు జమ అయిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి తాము ఎప్పుడూ అండగా ఉంటామని డ్వాక్రా మహిళలు తెలిపారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ సాంకేతిక లోపాల వల్ల కోనసీమ జిల్లాలో 135 గ్రూపులు కొత్తపేట నియోజకవర్గంలో 65 గ్రూపులకు రుణమాఫీ జరగలేదని ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ప్రత్యేకశ్రద్ధ తీసుకుని రూ.45 కోట్లు నిధులు మంజూరు చేశారని దీంతో మూడు సంవత్సరాలుగా పడని మొత్తం ఒకేసారి ఆయా గ్రూపులకు పడిందన్నారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన సీఎంకు తన తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు జగ్గిరెడ్డి అన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



గోపాలపురంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి-లావణ్య దంపతులు

రావులపాలెం: గర్భిణుల ఆరోగ్యంపై సీఎం జగన్ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద బుధవారం నియోజకవర్గ స్థాయి గర్భిణులకు సీమంతాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి జరిపించారు. సుమారు 200 మంది గర్భిణులకు సామూహిక సీమంతాలను జరిపించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి-లావణ్య దంపతులు గర్భిణులకు సాంప్రదాయబద్ధంగా చీర, రవిక, పసుపు-కుంకుమ, గాజులు, స్వీట్లు, పండ్లతో కూడిన కిట్లను వారికి అందచేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ మహిళలు రక్తహీనతతో ఇబ్బంది పడకూడదని, మహిళలు పౌష్టికాహార లోపాలతో ఇబ్బందులు పడకూడదన్న దృఢ సంకల్పంతో సీఎం జగన్ ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తుందన్నారు. అనంతరం మాతా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచులు సబ్బితి మోహనరావు, అంబటి సుబ్బలక్ష్మి, దొమ్మేటి అర్జునరావు, బొక్కా కరుణాకరం, పీహెచ్‌సీ వైద్యులు తదితరులు హాజరయ్యారు.

తపాలా ఉద్యోగుల సమ్మె విజయవంతం

రామచంద్రపురం: గ్రామీణ తపాలా ఉద్యోగుల కేంద్ర సంఘాల ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మె సందర్భంగా రామచంద్రపురం బ్రాంచ్‌లో సమ్మె పూర్తి స్థాయిలో విజయవంతమైందని సంఘం నేతలు అన్నారు. 150 మంది గ్రామీణ తపాలా ఉద్యోగులకు గాను 135 మంది సమ్మెలో పాల్గొన్నారని, మిగతా సభ్యులు నూతనంగా రిక్రూట్ అయినవారు కావటంతో సమ్మెకు దూరంగా ఉన్నట్లు నేతలు తెలిపారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులంతా తమ కోర్కెలకు అనుగుణంగా నినాదాలు చేశారు. బ్రాంచ్ యూనియన్ అధ్యక్షుడు వై.స్పర్జన్‌రాజు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 12, 24, 36 సంవత్సరాల సర్వీస్ ఉన్న ఉద్యోగులకు అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్న తదితర డిమాండ్లతో ఒక్క రోజు సమ్మె చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి మునేశ్వరరావు, కోశాధికారి వై.కామేశ్వరి, సహాయ కార్యదర్శి సీహెచ్ ప్రవీణ్ కుమార్, పెంకే గణేష్‌కుమార్, బళ్ల సత్యనారాయణ, బలసాడి శ్రీనివాసరావు, జి.రామకృష్ణ, బి.వీరయ్య చౌదరి, ఎ.రామకృష్ణ చౌదరి తదితరులు నాయకత్వం వహించారు. కార్మిక సంఘం నాయకులు పెద్దిరెడ్డి రాము తదితరులు సమ్మె శిబిరం వద్దకు వచ్చి మద్దత్తు తెలియజేశారు.



తపాలా కార్యాలయం వద్ద నిర్వహించిన సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు స్పర్జన్‌రాజు

సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు


రామచంద్రపురం: పురపాలక పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేసి పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం ఉదయం గుడ్‌మార్నింగ్ రామచంద్రపురం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యల పరిష్కారానికి కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేసి చర్యలు తీసుకున్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ పట్టణంలోని డ్రైనేజీల ద్వారా వచ్చే మురుగునీటిని మంచినీటిగా మార్చే ఎస్‌టీపీ పథకం సుమారుగా రూ.10 కోట్లతో చేపడుతున్నామన్నారు. ఇటీవల కాలంలో స్థల సేకరణలో ఎదురైన సమస్యను పరిష్కరించామన్నారు. త్వరలోనే ఎస్‌టీపీ పథకం ద్వారా మురుగునీటిని శుద్ధి చేసే ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందని మంత్రి వెల్లడించారు. పట్టణంలో మిగిలి ఉన్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశామని త్వరలోనే వీటి పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. దీని ద్వారా పట్టణంలో డ్రైనేజీల నిర్మాణం పూర్తవుతుందని మంత్రి తెలిపారు. ప్రధాన రహదారిలోని ఉత్తరం వైపున డ్రైనేజీలో పూడికతీత పనులు త్వరలోనే మొదలవుతాయని, దీని ద్వారా ప్రధాన డ్రైన్‌లు మురుగునీరు పూర్తి స్థాయిలో ప్రవహించే విధంగా ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య నిర్వహణలో పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. కౌన్సిలర్ కేతా శ్రీను, బొక్కా సత్యనారాయణ, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, పార్టీ నేతలు బావాల భద్రరావు, కంచుమర్తి బాబూరావు, కోటి దుర్గారావు, జుత్తుక గులాం బాషా, కుడిపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పలు సమస్యలపై కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి సూచనలు చేస్తున్న మంత్రి వేణు

కెరీర్ గైడెన్స్ శిక్షణకు రామలక్ష్మి

మండపేట: రాష్ట్రస్థాయి కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమానికి జిల్లా నుంచి కీ రిసోర్స్ పర్సన్‌గా పట్టణంలోని గౌతమీ మున్సిపల్ హైస్కూల్ బయలాజికల్ టీచర్ మేకా రామలక్ష్మి ఎంపికయ్యారు. స్కూల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మైసూర్‌లోని రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ వద్ద జరిగే శిక్షణ కార్యక్రమానికి రామలక్ష్మి హాజరవుతారని హెచ్ఎం సీహెచ్ శోభావళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు భవిష్యత్తు అవసరాలపై అవగాహన కల్పించేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. రామలక్ష్మి క్రియాత్మక విద్యపై అనేక ప్రయోగాలు నిర్వహించి రాష్ట్రస్థాయిలోనే అనేక ప్రశంసలు పొందారన్నారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ప్రోగ్రాం కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారని హెచ్ఎం శోభావళి తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి ఎంపిక కావడంపై పాఠశాల ఉపాధ్యాయులు రామలక్ష్మికి అభినందనలు తెలిపారు.



మేకా రామలక్ష్మి

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గొల్లపాలెం కాకినాడ, కోటిపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఇక్కడ నిత్యకృత్యంగా మారాయి. కోళ్లతూము సెంటర్, కాజులూరు జంక్షన్లలో వ్యాపార సముదాయాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో వస్తువులు కొనుగోలుకు వచ్చిన వినియోగదారులు రోడ్లపైనే తమ వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. మార్కెట్ సెంటర్లోనే హైస్కూల్, మండల పరిషత్ పాఠశాలలు ఉండటంతో చిన్నారులు బయటకు వచ్చే సందర్భంలో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. మరో చోట స్టేట్‌బ్యాంక్ సెంటర్‌లోనూ వాహనాలు రోడ్డుపైకి పార్కింగ్ చేస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. గ్రామంలోనే మండలానికి చెందిన రక్షణశాఖ కార్యాలయం ఉన్నప్పటికీ తగిన సిబ్బంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదని ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.